

జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
ఆదిలాబాద్
మంచిర్యాల-కుమరం భీం-నిర్మల్
గురువారం 16 జూలై 2026
పేజీలు : 8

# రెండేళ్లుగా ఏళ్లుగా సిద్ధంగా ఉన్నా తాళం వేసిన బీసీ బాలికల హాస్టల్



అద్దె గదుల్లో అవస్థలు.. కొత్త భవనం వైపు చూడని అధికారులు

మూడు మంది బీసీ బాలికల భవిష్యత్‌తో చెలగాటం

# గిరిజన యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

ఉట్నూరులో మెగా జాబ్ మే ళాను ప్రారంభించిన

ఐటీడీ ఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు



# కేటీఆర్ సమక్షంలో కేంద్ర మంత్రి కుమారస్వామితో చర్చలు సఫలం

ఆదిలాబాద్ సిసిఐ పునః ప్రారంభంపై చిగురిస్తున్న ఆశలు

అధునాతన సాంకేతికతతో పరిశ్రమను పునరుద్ధరిస్తామని కేంద్ర మంత్రి హామీ



# బీసీ యాదవ మహిళపై అవమానకర వ్యాఖ్యలు చేసిన శివచరణ్ రెడ్డిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్**



**మంచిర్యాల , 15, జూలై (ప్రజాజ్యోతి):** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బోర్డు సభ్యురాలు, 82 ఏళ్ల వృద్ధురాలు, బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన ఈశ్వరమ్మ యాదవ్‌పై యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి చేసినట్లు ఆరోపించబడుతున్న అవమానకర వ్యాఖ్యలను బీసీ సమాజ్ తీవ్రంగా ఖండించింది. మంచిర్యాలలోని బీసీ సమాజ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, ఒక వృద్ధ మహిళను, అదీ బీసీ యాదవ సామాజిక వర్గానికి చెందిన ప్రజాప్రతినిధి కేవలం తన తండ్రి ఫోటో ఫ్లెక్సీలో లేదనే కారణంతో అవమానించడం అత్యంత బాధాకరమని, ఇది కుల అహంకారాన్ని ప్రతిబింబించే చర్యగా అని అన్నారు. ముఖ్యమంత్రి విశ్వాసంతో ఒక బీసీ మహిళకు బాధ్యతలు అప్పగిస్తే, దానిని సహించలేక అవమానించడం బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్య అని అన్నారు. ప్రజాస్వామ్యంలో పదవులు కుటుంబ వారసత్వం వల్ల కాకుండా అర్హత, ప్రజల విశ్వాసం ఆధారంగానే లభిస్తాయని గుర్తుంచుకోవాలని సూచించారు. జక్కిడి శివచరణ్ రెడ్డిని యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవి నుంచి వెంటనే తొలగించి, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ బీసీలను అవమానించే శక్తులకు అండగా నిలుస్తోందనే అభిప్రాయం ప్రజల్లో బలపడుతుందని దన్నారు .ఈ ఘటనపై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి బీసీ సమాజానికి క్షమాపణ చెప్పాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు, నిరసన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. బీసీల ఆత్మగౌరవాన్ని కించపరిచే వారిని ఎంతటి వారైనా ఉపేక్షించబోమని, ప్రతి అవమానానికి ప్రజాస్వామ్యబద్ధంగా, చట్టబద్ధంగా గట్టి సమాధానం ఇస్తామని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి నరెడ్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు .

# తాడిచెర్ల-2 బొగ్గు బ్లాక్ సింగరేణికి దక్కడం చారిత్రాత్మకం

**సింగరేణి డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం. తిరుమల రావు**




**మంచిర్యాల , 15, జూలై (ప్రజాజ్యోతి):** తెలంగాణ ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం కృషి ఫలితంగా తాడిచెర్ల–2 బొగ్గు బ్లాక్ సింగరేణికి కేటాయించబడటం సంస్థ భవిష్యత్తుకు గొప్ప వరమని సింగరేణి డైరెక్టర్ (ఈ అండ్ ఎం) ఎం. తిరుమల రావు అన్నారు. బుధవారం ఎస్టిపిపి లో నిర్వహించిన తాడిచెర్ల–2 బొగ్గు బ్లాక్ సాధన విజయోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత పదేళ్లుగా సింగరేణికి కొత్త గనులు లేక సంస్థ భవిష్యత్తుపై ఆందోళనలు నెలకొన్న సమయంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి ఫలితంగా కేంద్ర ప్రభుత్వం తాడిచెర్ల–2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం ఎంతో సంతోషకరమని, ఇది ప్రతి సింగరేణి కార్మికుడి విజయమని కొనియాడారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఉన్న తాడిచెర్ల–2 బొగ్గు బ్లాక్‌లో 400 మిలియన్ టన్నులకు పైగా బొగ్గు నిల్వలు ఉండగా, అందులో సుమారు 340 మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీయవచ్చని తెలిపారు. ఈ గనిలో అత్యుత్తమ నాణ్యత కలిగిన జీ–9 గ్రేడ్ బొగ్గు లభిస్తుందని, దాదాపు 45 సంవత్సరాల పాటు నిరంతరాయంగా బొగ్గు ఉత్పత్తి కొనసాగించేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సుమారు 2,000 మందికి ప్రత్యక్షంగా, మరో 3,000 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అనంతరం అధికారులు, ఉద్యోగులతో కలిసి స్వీట్లు పంచుకుని విజయోత్సవాలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎం. తిరుమల రావు ఎస్టిపిపిలో నిర్మాణంలో ఉన్న 800 మెగావాట్ల మూడో యూనిట్ పనులను పరిశీలించారు. బాయిలర్ నిర్మాణం, ట్రాక్ హాపర్, ఫ్లూ గ్యాస్ డీ సల్ఫరైజేషన్ (ఎఫ్‌జీడీ) ప్రాజెక్ట్ పనులను స్వయంగా తనిఖీ చేసి, పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే ఉత్సాహంతో అధికారులు, ఉద్యోగులు సమిష్టిగా పనిచేసి నిర్ణీత గడువులోగా మూడో యూనిట్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ చిరంజీవి, జనరల్ మేనేజర్ (పీపీఎస్) మదన్ మోహన్, అదనపు జనరల్ మేనేజర్ (ఈఅండ్ఎం) సూర్యనారాయణ రాజు, అదనపు జనరల్ మేనేజర్ (ఓఅండ్ఎం) వీవీ సుధాకర్ రెడ్డి, అదనపు జనరల్ మేనేజర్ (ఫైనాన్స్) బి. శ్రీధర్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి సత్యనారాయణ, సీఎంఓఏఐ శాఖ అధ్యక్షుడు డి. పంతుల, 800 మెగావాట్ల ప్లాంట్ సమన్వయకర్త ఎం.వి. వేణుగోపాల్, డైరెక్టర్ ప్రత్యేక అధికారి కేశవరావు, పర్సనల్ విభాగాధిపతి ఎస్.వి. రాజేశ్వర్ రావుతో పాటు పలువురు అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం



**మంచిర్యాల , 15, జూలై (ప్రజాజ్యోతి):** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల, మంచిర్యాలలో మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. పాండురంగ శర్మ ఆధ్వర్యంలో, హెల్త్ సూపర్వైజర్ బి. లక్ష్మి సమన్వయంతో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ (డీఎండహెచ్ఓ), మంచిర్యాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు మహిళల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రత, సమతుల్య పోషకాహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి, నివారణ ఆరోగ్య సంరక్షణ వంటి ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్‌హెచ్ఎం ప్రతినిధి శ్రీలత మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలని, సమతుల్య ఆహారం తీసుకోవడంతో పాటు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహిళల ఆరోగ్యం, పరిశుభ్రతకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన పొందారు.

## వాంకిడి యువత కోసం డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు చేయాలి

**జిల్లా గ్రంథాలయ చైర్మన్‌కు సీపీఐ వినతిపత్రం**



**ఆసిఫాబాద్ , జూలై 15 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ గ్రంథాలయానికి శాశ్వత భవనం నిర్మించి, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ మండల సహాయ కార్యదర్శి కోదురుపాక మహేష్ మాట్లాడుతూ, ప్రస్తుతం గ్రంథాలయం తాత్కాలిక భవనంలో కొనసాగుతుండటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనున్న ఉద్యోగ నోటిఫికేషన్లకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత కోసం గ్రూప్స్, పోలీస్, ఉపాధ్యాయ తదితర పోటీ పరీక్షలకు సంబంధించిన తాజా పుస్తకాలు, స్టడీ మెటీరియల్స్, దినపత్రికలు, మాక్ టెస్ట్ పేపర్లు అందుబాటులో ఉంచాలని కోరారు. అలాగే డిజిటల్ లైబ్రరీ, కంప్యూటర్లు, ఇంటర్నెట్, ప్రత్యేక రీడింగ్ రూమ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన జిల్లా గ్రంథాలయ చైర్మన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, వార్కోల్ రాకేష్, పుప్పిరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తదానం ద్వారా అనేక మంది ప్రాణాలను కాపాడవచ్చు

### ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్

### హెచ్‌పీసీఎల్ రామగుండంలో ఘనంగా రక్తదాన శిబిరం 35 మంది స్వచ్ఛందంగా రక్తదానం



**మంచిర్యాల , 15, జూలై (ప్రజాజ్యోతి):** 'స్వచ్ఛతా పక్వాడా' కార్యక్రమాల సందర్భంగా హెచ్‌పీసీఎల్ రామగుండం, మంచిర్యాల కు చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం హెచ్‌పీసీఎల్ ప్రాంగణంలో భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హెచ్‌పీసీఎల్ డిపో మేనేజర్ శ్రీహర్ష ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, రక్తదానం అత్యున్నత మానవ సేవ అని అన్నారు. ఒక వ్యక్తి ఇచ్చిన రక్తం మరొకరి ప్రాణాలను కాపాడే అమూల్యమైన వరమని పేర్కొన్నారు. శిబిరంలో సేకరించిన రక్తాన్ని మంచిర్యాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి అందజేసి అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు పూర్తిగా ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, కిడ్నీ డయాలసిస్ రోగులు, రక్తహీనతతో బాధపడుతున్న వారు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు ఈ రక్తం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రతి ఆరోగ్యవంతుడు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం ద్వారా సమాజ సేవలో భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు. హెచ్‌పీసీఎల్ డిపో మేనేజర్ శ్రీహర్ష మాట్లాడుతూ, రక్తదానం చేయడం వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం తగ్గే అవకాశముందని, శరీరంలోని చెడు కొలెస్ట్రాల్ తగ్గడానికి కూడా దోహదపడుతుందని తెలిపారు. క్రమం తప్పకుండా రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు ప్రాణాపాయంలో ఉన్న వారికి ప్రాణదాతలుగా నిలవవచ్చని పేర్కొన్నారు. ఇలాంటి మహోన్నత సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఈ రక్తదాన శిబిరంలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన 35 మంది రక్తదాతలు రక్తదానం చేశారు. వారి సేవలను అభినందిస్తూ డిపో మేనేజర్ శ్రీహర్ష ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సేకరించిన రక్తాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి అప్పగించారు. రక్తం అవసరమైన వారికి సకాలంలో అందేలా రెడ్ క్రాస్ సొసైటీ చర్యలు తీసుకుంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ మేనేజర్ మనీష్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు కాసర్ల శ్రీనివాస్, డాక్టర్ ప్రేమ్ సాయి, సూపర్వైజర్ విజయ్, టెక్నీషియన్ సురేష్, సిస్టర్ శిరీష, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జీవితకాల సభ్యుడు హరీష్, హెచ్‌పీసీఎల్ సిబ్బంది, రెడ్ క్రాస్ ప్రతినిధులు, రక్తదాతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సింగరేణి భరోసా యాత్ర ఘనవిజయం

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఎస్‌సీఎంకేఎస్--బీఎంఎస్ కృతజ్ఞతలు



**మంచిర్యాల , 15, జూలై (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల ఉద్యోగ భద్రత, సంక్షేమం, సంస్థ భవిష్యత్ అభివృద్ధి లక్ష్యంగా నిర్వహించిన "సింగరేణి భరోసా యాత్ర" ఘనవిజయం సాధించిందని సింగరేణి కోల్ మైన్స్ కార్మిక సంఘ్ (ఎస్‌సీఎంకేఎస్--బీఎంఎస్) కార్యదర్శి, నేషనల్ డస్ట్ ప్రివెన్షన్ కమిటీ సభ్యుడు పి. మాధవ నాయక్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యాత్రకు నాయకత్వం వహించిన కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీఎంఎస్ విజ్ఞప్తుల మేరకు తాడిచెర్ల--2 బొగ్గు బ్లాక్‌ను సింగరేణికి కేటాయించడం, నైని బొగ్గు గనిలో ఉత్పత్తి ప్రారంభానికి అవసరమైన అనుమతులు కల్పించడం, వీకే ఓసీ, గోలేటి ఓసీ, పూసపల్లి ఓసీ తదితర ప్రాజెక్టులకు సాంకేతిక అనుమతులు వేగవంతం చేసే చర్యలు చేపట్టడం సింగరేణి భవిష్యత్‌కు బలమైన పునాది అని అన్నారు. అలాగే తెలంగాణ ప్రభుత్వ సంస్థలైన జెన్‌కో, ట్రాన్స్‌కో నుంచి సింగరేణికి రావలసిన సుమారు రూ.54 వేల కోట్ల బకాయిల అంశాన్ని దేశ ప్రజల దృష్టికి తీసుకెళ్లి, సంస్థ ఆర్థిక పరిస్థితులపై స్పష్టత కల్పిస్తూ కార్మికుల్లో విశ్వాసాన్ని పెంపొందించిన కేంద్ర మంత్రి కృషి అభినందనీయమని అన్నారు. భరోసా యాత్రలో పాల్గొన్న భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, అసెంబ్లీ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, డి.కె. అరుణ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు సహా యాత్ర విజయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ సింగరేణి కార్మికులు, అధికారులు, ప్రజల తరపున హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా వేలాది మంది కార్మికులు, అధికారులు, కార్మిక కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు యాత్రను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారని కొనియాడారు. భరోసా యాత్ర విజయంతో ఎస్‌సీఎంకేఎస్--బీఎంఎస్‌పై మరింత బాధ్యత పెరిగిందని, సింగరేణి పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధన, సంస్థ అభివృద్ధి కోసం గతంలో మాదిరిగానే మరింత చిత్తశుద్ధితో, పట్టుదలతో ఉద్యమాలు కొనసాగిస్తామని పి. మాధవ నాయక్ స్పష్టం చేశారు. చివరగా "కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి... సింగరేణి పరిరక్షణే మా ధ్యేయం... భారత్ మాతాకీ జై!" అని పిలుపునిచ్చారు.

## గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలి**

**మంచిర్యాల గో సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్ ప్రతినిధులు**



**మంచిర్యాల , 15, జూలై (ప్రజాజ్యోతి):** సనాతన ధర్మంలో గోమాతకు విశిష్ట స్థానం ఉందని, గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించి గోవధను దేశవ్యాప్తంగా పూర్తిగా నిషేధించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతూ గో సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్ ప్రతినిధులు కోరారు. గో సమ్మాన్ ఆహ్వాన్ అభియాన్ ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల పట్టణంలోని విశ్వనాథ ఆలయ కాలక్షేప మండపంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా అభియాన్ ప్రతినిధులు మాట్లాడుతూ గోమాతను కేవలం ఒక జంతువుగా కాకుండా వ్యవసాయం, ఆరోగ్యం, పర్యావరణ సమతుల్యతకు మూలాధారంగా చూడాలని అన్నారు. గో ఆధారిత జీవన విధానం ద్వారా ప్రకృతి సమతుల్యత సాధ్యమవుతుందని, గోజాతి పరిరక్షణతోనే మానవ మనుగడకు భరోసా ఉంటుందని అన్నారు. అభియాన్ ప్రధాన డిమాండ్లుగా దేశవ్యాప్తంగా గోవధను పూర్తిగా నిషేధించడం, గోవుకు 'రాష్ట్ర మాత' లేదా జాతీయ స్థాయి గౌరవ హోదా కల్పించడం, గోసేవ కోసం ప్రత్యేక కేంద్ర మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి గోరక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాలను కోరారు. ఈ ఉద్యమంలో భాగంగా జూలై 27 నుంచి అక్టోబర్ 27, 2026 వరకు దేశవ్యాప్తంగా 'గో సమ్మాన్ దివస్' కార్యక్రమాలను నిర్వహించి 40 కోట్ల సంతకాలు సేకరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సమర్పించనున్నట్లు తెలిపారు. గో ప్రేమికులు, సనాతన ధర్మ రక్షకులు, హిందూ బంధువులు పెద్ద సంఖ్యలో ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సతీష్ భవాని స్వామి, రఘు అఘోరి గురు స్వామి, దొంతుల ముకేశ్, గొనె శ్యాంసుందర్ రావు, వేముల హరి ప్రసాద్, కర్ణకంటి రవీందర్, కండె బద్రి నారాయణ, చంద్రశేఖర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్య సమస్యలతో వృద్ధుడి మృతి



**సారంగాపూర్,జులై 15,ప్రజా జ్యోతి** ఆలూరు గ్రామానికి చెందిన శివరాత్రి రాములు ం/శీ రాజన్న, వయసు 64 సంవత్సరాల వృద్ధుడు గత కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడని,నిర్మల్ ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చూపించు కున్న అతని కడుపు నొప్పి తగ్గక పోవడం తో అతని ఇంటి నందు ఉన్న దూలానికి నైలాన్ తాడుతో ఉరి వేసుకోగా అది గమనించి మృతుని భార్య, కొడుకు మృతుని ప్రభుత్య ఆసుపత్రికి తరలించగా మృతుడు చనిపోయినట్టు డాక్టరు నిర్ధారించరు. మృతుని కొడుకు శివరాత్రి రాజేందర్ పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఏఎస్ఐ వసంత్ తెలిపారు.

# నెన్నెల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డీసీపీ ఎగ్గడి భాస్కర్



**మంచిర్యాల , 15, జూలై (ప్రజాజ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్‌లో ఉన్న నెన్నెల పోలీస్ స్టేషన్‌ను మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన రిసెప్షన్ సెంటర్‌ను సందర్శించి సిబ్బందితో మాట్లాడి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం స్టేషన్ రైటర్, సీసీటీఎన్ఎస్ రైటర్లతో సమావేశమై ఆన్‌లైన్‌లో కేసుల వివరాల నమోదు, రికార్డుల అప్‌లోడ్ ప్రక్రియపై ఆరా తీశారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. దర్యాప్తు అధికారులు ప్రతి నేరస్థలాన్ని తప్పనిసరిగా సందర్శించి ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ నిర్వహించి ఆధారాలను నమోదు చేయాలని, ఈ–సాక్ష్య (ఈ–సాక్ష్య) యాప్‌లో సంబంధిత సమాచారాన్ని వెంటనే అప్‌డేట్ చేయాలని సూచించారు. పెండింగ్ కేసుల ఫైళ్లు, నేరాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన డీసీపీ, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ వ్యవహారాలపై సీఐ హనోక్, ఎస్ఐ రామకృష్ణరావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీపీ ఎగ్గడి భాస్కర్ మాట్లాడుతూ, పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, సీసీ కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి పోలీసు కానిస్టేబుల్ గ్రామ పోలీసు అధికారిగా గ్రామాలను తరచూ సందర్శిస్తూ ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకోవాలని, సమాచార వ్యవస్థను మరింత పటిష్ఠం చేసుకోవాలని తెలిపారు. సైబర్ నేరాలు, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించిన ఆయన, రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాల పాటింపు, హెల్మెట్, సీటు బెల్టు వినియోగంపై కూడా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజల భద్రత దృష్ట్యా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, వాటి ఉపయోగంపై ప్రజలు, వ్యాపారుల్లో చైతన్యం పెంచాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ కోసం రాత్రి పెట్రోలింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అలాగే పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా, స్నేహపూర్వకంగా వ్యవహరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీసు సిబ్బందికి సూచించారు.

# సోనాల మండల కేంద్రంలో కలెక్టర్ విస్తృత పర్యటన





**సోనాల, జూలై 15 (ప్రజాజ్యోతి):** నానో ఎరువుల వినియోగాన్ని ఎక్కువగా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. బుధవారం సోనాల మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించి ఎరువుల విక్రయ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పక్రియను ఆయన పరిశీలించి, మండల విద్యాశాఖ కార్యాలయాన్ని, ప్రీ ప్రైమరీ స్కూల్ ను ప్రారంభించారు. ముందుగా శ్రీ సాయి బాబా ఫెర్టిలైజర్స్ దుకాణంతో పాటు గోదామును నిశితంగా పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సాంప్రదాయ ఎరువులతో పోలిస్తే నానో యూరియా, నానో డీఏపీ ధరలు అందుబాటులో ఉన్నాయని, వీటి వాడకంపై రైతుల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఖర్చు తగ్గించే నానో ఎరువుల వినియోగాన్ని ఎక్కువగా ప్రోత్సహించాలని స్పష్టం చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వివిధ విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. వైద్యుడిని మందుల నిలువలు, ఆసుపత్రి లో సమస్యలపై ఆరా తీశారు. ఆసుపత్రి ప్రాంగణంలోని గార్డెన్ నిర్వహణ తీరుపై సంతృప్తి వ్యక్తం చేస్తూ సిబ్బందిని అభినందించారు. తదుపరి మండల కేంద్రంలోని సోనాల గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను పరిశీలించి ఫారాలను తప్పులు లేకుండా నింపేలా చేసుకోవాలని, ఓటర్లకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రతి ఫారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా డిజిటలైజేషన్ ప్రక్రియ పూర్తి చేయాలని బి.ఎల్.ఓ, సూపర్ వైజర్లను ఆదేశించారు. ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తూ గ్రామస్తులు భోజన ప్లేట్లను కలెక్టర్ చేతుల మీదుగా గ్రామపంచాయతీకి అందజేశారు. ఆ తరువాత నూతనంగా ఏర్పాటు చేసిన మండల విద్యా శాఖ కార్యాలయాన్ని, ప్రీ ప్రైమరీ పాఠశాల ను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ప్రీ ప్రైమరీ విద్యార్థులు రోజు హాజరయ్యేల పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, తహసీల్దార్ మల్లేష్, ఎంపీడీవో రత్నాకర్, ఏం.ఈ.ఓ ఉస్సేన్, డా.నవీన్ రెడ్డి, మండల ఏవో దేవా, ఫెర్టిలైజర్ షాప్ నిర్వాహకుడు శ్రవణ్ కుమార్, సర్పంచ్ బిందుజ, విడిసి చైర్మన్ శ్రీనివాస్, బిఎల్ఓ లు, సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.

## పార్డీ (బి) ఆశ్రమ పాఠశాల అకస్మిక తనిఖీ



**సోనాల, జూలై 15( ప్రజా జ్యోతి):** బుధవారం సోనాల మండలం పార్డీ(బి) గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలను కలెక్టర్ రాజార్షి షా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వంటగది, భోజనశాల, తరగతి గదులను పరిశీలించి విద్యార్థులను మెనూ గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల ఆవరణలోని బోర్ యొక్క నీటి నాణ్యత టీడీఎస్ తో కొలిచి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో కనీస అభ్యసన నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఎఫ్.ఎల్.ఎన్' (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) కార్యక్రమ అమలు తీరుపై మరింత శిక్షణ అందించాలని సూచించారు. 1 నుండి 5వ తరగతి విద్యార్థులకు ఎఫ్.ఎల్.ఎన్ పరీక్షలు నిర్వహించి, వారి రీడింగ్ సామర్థ్యాలను, పఠన నైపుణ్యాలను ఆయన స్వయంగా పరిశీలించి సమాధానాలను రాబట్టారు. ఈ పరిశీలనలో ఏంఆర్ఓ మల్లేష్, ఎంపీడీవో రత్నాకర్, ఉపాధ్యాయులు రాజన్న, శేఖర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి కార్మికుడి కుమారుడు గ్రూప్-1లో విజయం.. డీఎస్పీగా ఎంపిక.



**మందమర్రి, జూలై 15(ప్రజాజ్యోతి ):** సింగరేణి కార్మికుడి కుమారుడు గ్రూప్–1 పరీక్షలో ఉత్తీర్ణత సాధించి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (డీఎస్పీ)గా ఎంపిక కావడం గర్వకారణమని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ అన్నారు. మందమర్రి ఏరియాలోని కేకే ఓపెన్ కాస్ట్ గనిలో కన్వేయర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న డి. రవీందర్ కుమారుడు డి. ప్రవీణ్ కుమార్ ఇటీవల ప్రకటించిన గ్రూప్–1 ఫలితాల్లో విజయం సాధించి డీఎస్పీగా ఎంపికయ్యారు. పెద్దపల్లిలో డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించనున్న ప్రవీణ్ కుమార్‌ను, ఆయన తండ్రి రవీందర్‌ను బుధవారం జీఎం కార్యాలయంలో ఎన్. రాధాకృష్ణ శాలువాతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ, సాధారణ కార్మికుడైన రవీందర్ తన కుమారుడిని ఉన్నత చదువులు చదివించి ఈ స్థాయికి చేర్చడం అభినందనీయమన్నారు. ప్రవీణ్ కుమార్ తన విధుల్లో ప్రజలకు ఆదర్శవంతమైన సేవలు అందిస్తూ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అలాగే సింగరేణి కార్మికులు గనుల్లో భద్రతా నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా విధులు నిర్వహించడంతో పాటు, తమ పిల్లలను ఉన్నత విద్యాభ్యాసం వైపు ప్రోత్సహించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని జీఎం పిలుపునిచ్చారు.

# భూముల రీ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



అదనపు కలెక్టర్ వి. రాములు



**మంచిర్యాల, 15, జూలై (ప్రజాజ్యోతి):** పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి. రాములు అధికారులను ఆదేశించారు. బుధవారం మంచిర్యాల జిల్లా భీమారం మండలం లోని మద్దికల్ గ్రామంలో కొనసాగుతున్న రీ సర్వే పనులను మండల తహసీల్దార్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మద్దికల్ గ్రామంలో మొత్తం 853 సర్వే నంబర్ల పరిధిలో 4,810 ఎకరాల భూమి ఉందని తెలిపారు. ముగ్గురు లైసెన్స్ సర్వేయర్లు, ఒక సర్వేయర్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, రైతుల సమక్షంలో రీ సర్వే పనులు కొనసాగు తున్నాయని చెప్పారు. రైతులు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నారని పేర్కొంటూ, ప్రభుత్వ నిబంధనల మేరకు రీ సర్వేను కచ్చితత్వంతో పూర్తి చేయాలని సూచించారు. దీంతో భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా స్పష్టమైన వివరాలతో నక్షా రూపొందించబడు తుందని అన్నారు. అనంతరం ఆరెపల్లి గ్రామం, భీమారం మండల పరిషత్ కార్యాలయాన్ని సందర్శించి ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతిని సమీక్షించారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ పనులను వేగవంతం చేసి, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తర్వాత అంకుశాపూర్ గ్రామంలోని సమతా అగ్రో ఇండస్ట్రీస్ రైస్ మిల్లును తహసీల్దార్‌తో కలిసి తనిఖీ చేశారు. మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రభుత్వానికి అందించాల్సిన సెంట్రల్ పూల్ రైస్ (సి.ఎం.ఆర్.) బియ్యాన్ని నిర్దేశిత గడువులోగా సరఫరా చేయాలని మిల్లు నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పంటల సాగుపై 'ఎల్ నినో' ప్రభావం

**రైతులకు ఏఈఓ స్రవంతి కీలక సూచనలు**



**నేరడిగొండ, జూలై 15 (ప్రజాజ్యోతి):** మండలంలోని గాజిలి గ్రామంలో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) స్రవంతి బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో కలిసి పంట పొలాలను స్వయంగా పరిశీలించారు. ప్రస్తుత సీజన్‌లో 'ఎల్ నినో' ప్రభావం నేపథ్యంలో రైతులు పంటల సంరక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టాలో వారికి వివరించారు.

**తగినంత తేమ లేకుంటే ఎరువులు వేయొద్దు**

పంట పొలాల పరిశీలన అనంతరం ఏఈఓ స్రవంతి రైతులతో మాట్లాడుతూ పలు కీలక సూచనలు చేశారు: భూమిలో తగినంత తేమ శాతం లేనప్పుడు ఎలాంటి రసాయన ఎరువులు వేయకూడదు

**వర్షాల తర్వాతే ఎరువుల వినియోగం:**

సరైన వర్షాలు కురిసి, నేలలో పదును (తేమ) ఏర్పడిన తర్వాతే పంటలకు ఎరువులు వేసుకోవాలి. తేమ లేని సమయంలో ఎరువులు వేస్తే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉంది.

**వాతావరణ మార్పులపై అప్రమత్తత:**

ఎల్ నినో ప్రభావం వల్ల వర్షపాతంలో హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉన్నందున, రైతులు వ్యవసాయ అధికారుల సలహాల మేరకు సాగు పద్ధతులు పాటించాలి. తమ గ్రామానికి స్వయంగా వచ్చి పంటలను పరిశీలించి, సమయానుకూలంగా విలువైన సలహాలు, సూచనలు అందించినందుకు గ్రామ రైతులు వ్యవసాయ అధికారిణి స్రవంతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో గ్రామస్తులు, రైతులు అయిన రాంపాల్, లక్ష్మణ్, దస్రు, యాదవరావు తదితరులు పాల్గొన్నారు.

## టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ని కలిసిన డిసిసి అధ్యక్షుడు డా.,నరేష్ జాదవ్



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 15, (ప్రజా జ్యోతి)** హైదరాబాద్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీ సీసీ) రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ని బుధవారం ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా శాలువాతో సన్మానించి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయ నిర్మాణానికి భూమిని కేటాయిస్తూ తెలంగాణ ప్ర భుత్వం ఇటీవల జీవో జారీ చేయడంలో ప్రత్యేక చొరవ తీసుకుని సహకరించిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపా రు.జిల్లా కాంగ్రెస్ కార్యకర్తల ఎన్నో ఏళ్ల ఆకాంక్ష నెరవేరే లా చేసిన ఈ నిర్ణయం పార్టీ బలోపేతానికి ఎంతో దోహద పడుతుందని పేర్కొన్నారు.త్వరలోనే నూతన జిల్లా కాంగ్రెస్ కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభం కానుండ టంతో జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందోత్సాహాలు నెల కొన్నాయని డాక్టర్ నరేష్ జాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క, నిర్మల్ నియోజక వర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ శ్రీహరి రావు, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## మందమర్రి సీఈఆర్ క్లబ్‌లో 17న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం.

**ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సేవలు**

**ప్రజలు వినియోగించుకోవాలని విజ్ఞప్తి.**




**మందమర్రి, జూలై 15(ప్రజాజ్యోతి ):** మందమర్రి పట్టణంలోని సీఈఆర్ క్లబ్‌లో ఈ నెల 17వ తేదీన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు కమ్యూనికేషన్ సెల్ అధికారులు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగే ఈ శిబిరంలో హైదరాబాద్‌కు చెందిన మాతా రిసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆయుర్వేదకు చెందిన డాక్టర్ విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. ఈ వైద్య శిబిరానికి గతంలో చికిత్స పొందిన వారు, అలాగే తొలిసారిగా ఆయుర్వేద వైద్యం పొందాలనుకునే వారు కూడా హాజరై వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.

## మందమర్రి మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాలి.

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఎన్నికల సాధన కమిటీ వినతి -- 1/70 చట్ట సమస్యకు శాశ్వత పరిష్కారం కోరుతూ విజ్ఞప్తి.**



**మందమర్రి, జూలై 15(ప్రజాజ్యోతి ):** దాదాపు పాతికేళ్లుగా మున్సిపల్ ఎన్నికలు జరగక మందమర్రి పట్టణం అభివృద్ధి పరంగా వెనుకబడుతోందని పేర్కొంటూ, ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు చేపట్టాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డికి మందమర్రి మున్సిపల్ ఎన్నికల సాధన కమిటీ వినతిపత్రం అందజేసింది. మున్సిపాలిటీలో 1/70 చట్టం అమలులో ఉండటంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయిందని కమిటీ ప్రతినిధులు వివరించారు. దీనివల్ల ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోకపోవడంతో పాటు పట్టణ అభివృద్ధి పనులు కూడా ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని పేర్కొన్నారు. ప్రజల చేత ఎన్నికైన పాలకవర్గం లేకపోవడంతో స్థానిక అవసరాలకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంతో సమన్వయం చేసి 1/70 చట్టానికి సంబంధించిన ప్రతిబంధకాలను తొలగించి, మందమర్రి మున్సిపల్ ఎన్నికలను త్వరితగతిన నిర్వహించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు నిర్వహిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతం కావడంతో పాటు పట్టణ అభివృద్ధి పనులు వేగం పుంజుకుని, ప్రజలకు మెరుగైన పాలన అందుబాటులోకి వస్తుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల సాధన కమిటీ కన్వీనర్ అందుగుల శ్రీనివాస్‌తో పాటు మిట్ట లక్ష్మణ్, మాయ రమేష్, రాయబారం వెంకన్న, గాజుల శంకర్, ఎండి మోహిత్ ఖాన్, తుంగపిండి శంకర్, కత్తర్ల తిరుపతి, నల్లుల శంకర్, సోమయ్య, రసూల్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## మెగా జాబ్ మేళాలో 225 మంది గిరిజన యువతకు ఉద్యోగ అవకాశాలు



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 15, (ప్రజా జ్యోతి)**సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉట్నూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు గిరిజన యువత నుంచి విశేష స్పందన లభించింది. హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి ఆదిలా బాద్ జిల్లాలకు చెందిన మొత్తం 20 ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీలు (ఎం ఎన్ సి) లు, ప్రైవేట్ సంస్థల ప్రతినిధులు ఈ జాబ్ మేళాలో పా ల్గొని అభ్యర్థులకు ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లిప్‌కార్ట్ , మెడ్‌ప్లస్, జీ 4 ఎస్ సెక్యూరిటీ సర్వీసెస్, అపోలో ఫార్మసీ, ప్రీమియర్ హెల్త్ సర్వీసెస్,ఐపీఎస్-ఎఫ్‌ఎస్‌ఎస్ తో పాటు ఇతర ప్రముఖ సంస్థల ప్రతినిధులు వివిధ విభాగాలకు సంబంధించిన ఉద్యోగాల కోసం అభ్యర్థుల అర్హతలు, నైపుణ్యాల ను పరిశీలించి ఎంపిక ప్రక్రియ చేపట్టారు. ఇంటర్వ్యూల అనం తరం మొత్తం 225 మంది గిరిజన యువతీ యువ కులు వివిధ సంస్థల్లో ఉద్యో గాలకు ఎంపికయ్యారు. ఈ ఉద్యోగాల ద్వారా గిరిజన యువతకు ప్రైవేట్ రంగంలో మెరుగైన ఉపాధి అవకా శాలు లభించడం సంతోష క రమని నిర్వాహకులు తెలిపారు.

## విద్యార్థులకు మెనూ ప్రకా రం నాణ్యమైన భోజనం అందించాలి

జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 15, (ప్రజా జ్యోతి)** విద్యార్థులకు మెనూ ప్రకా రం భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధి కారులను ఆదేశించారు. బుధవారం సోనాల మండలం పార్డీ(బి) గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వంట గది, భోజనశాల, తరగతి గదులను పరిశీలించి విద్యా ర్థులను మెనూ గురించి వివ రాలను అడిగి తెలుసుకు న్నారు. పాఠశాల ఆవరణలోని బోర్ యొక్క నీటి నా ణ్యత టీడీఎస్ తో కొలిచి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూమె నూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థుల్లో కనీస అభ్యసన నైపుణ్యాలను పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రవేశపె ట్టినఎఫ్.ఎల్.ఎన్' (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమ రసీ) కార్యక్రమ అమలు తీ రుపై మరింత శిక్షణ అందించాలని సూచించారు. 1 నుండి 5వ తరగతి విద్యా ర్థులకు ఎఫ్.ఎల్.ఎన్ పరీక్ష లు నిర్వహించి, వారి రీడింగ్ సామ ర్థ్యాలను, పఠన నై పుణ్యాలను ఆయన స్వయంగా పరిశీలించి సమాధానాలను రాబట్టారు.ఈ పరిశీలనలో ఏంఆర్ఓ మల్లేష్, ఎంపీడీఓ రత్నాకర్, ఉపాధ్యాయులు రాజన్న, శేఖర్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతిపై శ్రీరాంపూర్‌కు వెళ్తున్న సురేష్ కుమార్‌కు ఘన సన్మానం

### మందమర్రి ఏరియాలో విశిష్ట సేవలు అందించారని జీఎం ఎన్. రాధాకృష్ణ ప్రశంస.



**మందమర్రి, జూలై 15(ప్రజాజ్యోతి ):** సింగరేణి మందమర్రి ఏరియాలో డిప్యూటీ జనరల్ మేనేజర్ (ఈ అండ్ ఎం)గా విధులు నిర్వహించిన శ్రీ ఎస్. సురేష్ కుమార్ పదోన్నతిపై శ్రీరాంపూర్ ఏరియా ఇంజనీర్‌గా బదిలీ కావడంతో బుధవారం జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఆయనకు ఘనంగా ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా జనరల్ మేనేజర్ శ్రీ ఎన్.రాధాకృష్ణతో పాటు పలువురు ఉన్నతాధికారులు శాలువా కప్పి, పూల బొకే అందించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా జీఎం ఎన్.రాధాకృష్ణ మాట్లాడుతూ, సురేష్ కుమార్ మందమర్రి ఏరియాలో సమర్థవంతంగా సేవలందించారని కొనియాడారు. స్నేహపూర్వక, మృదు స్వభావం కలిగిన అధికారిగా ఆయన అందరి ఆదరణ పొందారని పేర్కొన్నారు. తన ఆధ్వర్యంలో అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించి ఏరియా అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని ప్రశంసించారు.పదోన్నతితో శ్రీరాంపూర్ ఏరియా ఇంజనీర్‌గా బాధ్యతలు చేపట్టనున్న సురేష్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, కొత్త బాధ్యతల్లోనూ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఈ సన్మాన కార్యక్రమంలో ఎస్.ఓ. టు జీఎం జి.ఎల్. ప్రసాద్, బెల్లంపల్లి రీజియన్ జీఎం (సేఫ్టీ) రఘు కుమార్, కేకే ఓసీపీ ప్రాజెక్టు అధికారి రాంబాబు, ఎస్‌కే ఏజెంట్ సంతోష్ కుమార్, ఏరియా ఈ అండ్ ఎం అధికారి బాలాజీ భగవతి ఝా, ఎజీఎం (అకౌంట్స్) ఆర్.వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్, డీజీఎం (ఐఈడీ) కె. కిరణ్ కుమార్, డీజీఎం (సర్వే) భుఖ్య దేశాయ్, డీజీఎం (పర్సనల్) సి.హెచ్. అశోక్‌తో పాటు వివిధ గనులు, విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు ఎరువుల విక్రయాలు.. కఠిన చర్యలు తీసుకోవాలి

### రైతులను దోచుకుంటున్న ఎరువుల వ్యాపారులపై ఉక్కుపాదం మోపాలి

### ఎంఆర్పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేయాలి

### ఎరువుల దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలి: బొట్టుపెల్లి జైరామ్



**ఆసిఫాబాద్ జిల్లా 15 ప్రజా జ్యోతి** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా రైతు సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బోట్పెల్లి జైరామ్ డిమాండ్ చేశారు.సాగు సీజన్‌ను ఆసరాగా చేసుకుని కొందరు ఎరువుల వ్యాపారులు యూరియా, డీఏపీ, కాంప్లెక్స్ ఎరువులు, సూక్ష్మపోషకాలపై అధిక ధరలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. రైతులకు బిల్లులు ఇవ్వకుండా నగదు తీసుకోవడం, ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని బలవంతం చేయడం వంటి అక్రమాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.వ్యవసాయ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నామని చెబుతున్నప్పటికీ, వాటి ప్రభావం కనిపించడం లేదని విమర్శించారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ఎరువుల దుకాణాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, లైసెన్సులు రద్దు చేయాలని కోరారు.వాంకిడి మండల వ్యవసాయ అధికారి రైతుల సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ, సంబంధిత అధికారిని వెంటనే బదిలీ చేసి రైతుల పట్ల బాధ్యతగా పనిచేసే అధికారిని నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించి వ్యవసాయ, రెవెన్యూ, పోలీసు శాఖలతో సంయుక్త తనిఖీలు నిర్వహించాలని, రైతుల కోసం ప్రత్యేక ఫిర్యాదు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. సమస్యలు పరిష్కరించకపోతే జిల్లా వ్యాప్తంగా దశలవారీ ఆందోళనలు చేపడతామని జైరామ్ హెచ్చరించారు.

## విద్యార్థులతో కలిసి భోజనం చేసిన సర్పంచ్.. మధ్యాహ్న భోజన నాణ్యతపై ఆకస్మిక తనిఖీ



**ఆసిఫాబాద్ జూలై 15 ప్రజా జ్యోతి** విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనంలో రాళ్లు వస్తున్నాయని, నాసిరకం ఆహారం అందిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో మండల ఖమన పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో గ్రామ సర్పంచ్ సునీత, ఉపసర్పంచ్ లాహు కుమార్, వార్డు సభ్యురాలు సంగీత ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించారు. అనంతరం వంటశాల పరిశుభ్రత, ఆహార తయారీ విధానాన్ని తనిఖీ చేసి సంబంధిత వివరాలను తెలుసుకున్నారు. విద్యార్థులతో వంట సిబ్బంది మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించిన ప్రజాప్రతినిధులు, విద్యార్థులకు పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనం అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి లోపాలు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

# స్త్రీ నిధి రుణాల రికవరీలో పురోగతి సాధించాలి

**జిల్లా కలెక్టర్ కె.హరిత**



**ఆసిఫాబాద్ జూలై 15 (ప్రజా జ్యోతి)** స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక చేయూత అందించేందుకు స్త్రీ నిధి ద్వారా ఇచ్చిన రుణాల రికవరీలో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి దత్తారావులితో కలిసి సెర్ప్ డిపిఎంలు, ఏపీఎంలు, సిసిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చిన స్త్రీ నిధి రుణాలను వెంటనే రికవరీ చేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం లక్ష మందికి పైగా మహిళలు స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా ఉన్నారని, మరో 15 వేల మంది కొత్త సభ్యులను చేర్చి సంఘాలను బలోపేతం చేయాలని సూచించారు. మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడేందుకు చేపల పెంపకం, సమీకృత కోళ్ల పెంపకం, గొర్రెల పెంపకం, పాడి గేదెల నిర్వహణ వంటి కార్యకలాపాల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని తెలిపారు.ప్రతి గ్రామానికి గ్రామ సమాఖ్య భవనాలు, ప్రతి మండలానికి ఒకటి చొప్పున గోదాములను మంజూరు చేశామని, సంబంధిత పనులను వెంటనే ప్రారంభించి త్వరగా పూర్తి చేయాలని ఏపీఎంలు, సిసిలను ఆదేశించారు. ప్రతిరోజు వీటిని పర్యవేక్షించాల న్నారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ఆర్థిక సహాయం అందించాలని, పింఛన్ల పరిశీలన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఏపీఎంలు, సిసిలకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వడ్డాడి, హస్నాపూర్ గ్రామాల్లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన ఏ ఎంసీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి

**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 15, (ప్రజా జ్యోతి)** తాంసి మండలం వడ్డాడి, హస్నాపూర్ గ్రామాల్లో చేప డుతున్న ఓటరు జాబితా స వరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రి యను ఆదిలాబాద్ వ్యవ సాయ మార్కెట్ కమిటీ చై ర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సంద ర్భంగా గ్రామాల్లో పోలింగ్ స్టేషన్ల వారీగా జరుగుతున్న ప్రక్రియ వివరాలను ఆయన స్వయంగా పరిశీలించి తెలు సుకున్నారు. గడువులోగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియ లో ఫా రాలు నింపకపోతే ఓటు పోయే ప్రమాదం ఉందని, బి ఎల్ ఓ లు, కాంగ్రెస్ పార్టీ శ్రే ణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రభు త్వం అందించే ప్రతి సంక్షేమ పథకం ఓటు హక్కు వినియోగం పైనే ఆధారపడి ఉంటుందని, ఓటు హక్కును వినియోగించుకోని వారికి ప్రభుత్వ పథకాలు అందవని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్ర మంలో ఆత్మ చైర్మన్ కౌడల నారాయ ణ ఎఎంసి సభ్యులు ధనుంజ య్, కంది చక్రధర్ రెడ్డి, హస్నాపూర్ సర్పంచ్ ఎల్మ లింగారెడ్డి, చిలుకూరి వెంకట్ రెడ్డి, మాజీ సర్పం చ్ మోహన్, చందర్ రెడ్డి, గడ్డం నవీన్, బెండ జై సుధ, వడ్డాడి సర్పంచ్ గంగాధర్, ఉప సర్పంచ్ రమాకాంత్, దశాంత్, శ్రీకాంత్, వాకి, దేవరీ గంగాధర్, హన్మాండ్లు, గంగయ్య, అఫ్రోజ్ తదితరులు ఉన్నారు.

# రెండేళ్లుగా ఏళ్లుగా సిద్ధంగా ఉన్నా తాళం వేసిన బీసీ బాలికల హాస్టల్

### అద్దె గదుల్లో అవస్థలు.. కొత్త భవనం వైపు చూడని అధికారులు

### మూడు మంది బీసీ బాలికల భవిష్యత్‌తో చెలగాటం

**ఆసిఫాబాద్ జూలై 15 ప్రజా జ్యోతి** జిల్లా కేంద్రంలో పాత కలెక్టరేట్ ఎదురుగా నిర్మించిన బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. బుధవారం సీపీఎం పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నేతలు నిర్మాణంలో ఉన్న వసతి గృహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దుర్గం దినకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో నిర్మించిన బీసీ బాలికల కళాశాల వసతి గృహ నిర్మాణం పూర్తయి రెండు సంవత్సరాలు అవుతున్నా జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రారంభించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల బీసీ బాలికల కళాశాలలో చదువుతున్న విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. గత 10 సంవత్సరాలుగా బీసీ బాలికల వసతి గృహం అద్దె భవనంలో అరకొర సౌకర్యాలతో, ఇరుకు గదుల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో పలుమార్లు జిల్లా అధికారులకు, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందించడం లేదన్నారు. ఈ వసతి గృహాన్ని ప్రారంభిస్తే దాదాపు 300 మంది విద్యార్థులకు సౌకర్యంగా ఉంటుందని చెప్పారు.



వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి కళాశాల వసతి గృహాన్ని ప్రారంభించాలని కోరారు. ప్రారంభించని యెడల సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రారంభించే వరకు దశల వారీగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు గోడిసెల కార్తీక్, గేడం టికానంద్, నాయకులు తిరుపతి, రాజ్ కుమార్, మల్లేష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు సామాజిక మా ధ్యమాలకు దూరంగా ఉండి శ్రద్ధగా చదువుకోవాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**





**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 15, (ప్రజా జ్యోతి)**విద్యార్థులు సోషల్ మీడియా, సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి శ్రద్ధగా చదువుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. బుధవా రం సోనాల మండల కేంద్రంలోని పిఎంశ్రీ జడ్పీ సెకండరీ పాఠశాలలో నిర్వహించిన ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యా రు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థుల కు సెంట్రలైజ్డ్ కిచెన్ ద్వారా మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం పూట రాగి జావ వంటి పౌష్టికాహా రాన్ని అందించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా విద్యార్థినుల్లో రక్తహీనత నివారణకు రాగి జావ ఎంతో దోహద పడుతుందని, జంక్ ఫుడ్స్, చిప్స్ వంటి వాటికి దూరంగా ఉండి విద్యార్థులు క్రమశిక్ష ణతో కూడిన జీవనశైలిని అలవర్చుకోవాలని పిలుపు నిచ్చారు. పాఠశాలలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్ రిడ్రెస్సల్ కమిటీ ఆధ్వర్యంలో ఒక ఫిర్యాదుల పెట్టె ను ఏర్పాటు చేసి నట్లు వెల్లడించారు. దీని ద్వారా వచ్చే ఫిర్యాదులను హెచ్ఎంతో కలిసి కమిటీ స్వయంగా పరిశీలించి పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. అలాగే, విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసం పెంపొం దించేందుకు ఏపీజే అబ్దుల్ కలాం, డా. బి.ఆర్. అంబేద్క ర్, ఎస్.ఆర్. శంకరన్ వంటి మహనీయుల జీవిత విశేషాలను పాఠ్య పుస్తకాల్లో చేర్చి నట్లు తెలిపారు. విద్యార్థులు మొబైల్ ఫోన్లను కేవలం చదువు కోసమే ఉపయోగించాలని, రీల్స్, ఇన్‌స్టా గ్రామ్, ఫేస్ బుక్ వంటి సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో నూ రాణించాలని హితవు పలికారు. పాఠశాల అభివృద్ధికి డీ ఆర్డీఓ సహకారంతో న్యూ ట్రీ గార్డెన్స్, కాంపౌండ్ వాల్, కిచెన్ షెడ్, టాయిలెట్ల ని ర్మాణానికి త్వరలోనే నిధులు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. అదేవిధంగా మండలంలో కొత్త ఎంఆర్ఓ ఆఫీస్ భవన నిర్మాణాన్ని సైతం త్వరలోనే ప్రారంభిస్తా మని హామీ ఇచ్చారు. అనంతరం పాఠశాలలో గ్రంథాలయం, న్యూట్రి గార్డెన్లను ప్రారంభించి మొక్కను నాటి నీరు పోశారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన కాంప్లైంట్ బాక్స్‌లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి అధికారులకు తగు చర్యల నిమిత్తం ఆదేశాలకు జారీ చే శారు. ఈ కార్యక్రమంలో డి ఈ ఓ మాధవి, డి ఆర్డీఓ రవీందర్ రాథోడ్, ఏం ఆర్ఓ మల్లేష్, ఎంపీడీ వో రత్నాకర్‌రావు, ఏం ఈఓ ఉస్సేన్, సర్పంచ్ బిందుజ, ప్రధానోపాధ్యాయులు సచిన్, విద్యా శాఖ సిబ్బంది అజయ్, విడిసి సభ్యులు తుల శ్రీనివాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వడ్డాడి, హస్నాపూర్ గ్రామా ల్లో ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన ఏ ఎంసీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 15, (ప్రజా జ్యోతి)** తాంసి మండలం వడ్డాడి, హస్నాపూర్ గ్రామాల్లో చేప డుతున్న ఓటరు జాబితాస వరణ (ఎస్ ఐ ఆర్) ప్రక్రియను ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సంద ర్భంగా గ్రామాల్లో పోలింగ్ స్టేషన్ల వారీగా జరుగుతున్న ప్రక్రియ వివరాలను ఆయన స్వయంగా పరిశీలించి తెలు సుకు న్నారు. గడువులోగా ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో ఫారాలు నింపక పోతే ఓటు పోయే ప్రమాదం ఉందని, బి ఎల్ ఓలు, కాంగ్రెస్ పార్టీ శ్రే ణులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న రోజుల్లో ప్రభు త్వం అందించే ప్రతి సంక్షేమ పథకం ఓటు హక్కు వినియోగం పైనే ఆ ధారపడి ఉంటుందని, ఓటు హక్కును విని యోగించు కోని వారికి ప్రభుత్వ పథకాలు అందవని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కౌడల నారాయణ ఎఎంసి సభ్యులు ధనుంజయ్, కంది చక్రధర్ రెడ్డి, హస్నాపూర్ సర్పంచ్ ఎల్మ లింగారెడ్డి, చిలుకూరి వెంకట్ రెడ్డి,మాజీ సర్పంచ్ మోహన్ చందర్ రెడ్డి, గడ్డం నవీన్, బెండ జై సుధ, వడ్డాడి సర్పంచ్ గంగాధర్, ఉప సర్పంచ్ రమాకాంత్, దశాంత్, శ్రీ కాంత్, వాకి, దేవరీ గంగాధర్, హన్మాండ్లు, గంగయ్య అఫ్రోజ్ తదితరులు ఉన్నారు.

## ప్రజలకు మెరుగైన ప్రథమ చికిత్స సేవలు అందించాలి

**డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్**




**మంచిర్యాల, 15,జూలై (ప్రజా జ్యోతి):**జిల్లాలోని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు ప్రజలకు నాణ్యమైన ప్రథమ చికిత్స సేవలు అందిస్తూ, ఆరోగ్య పరిరక్షణలో బాధ్యతాయుతంగా వ్యవహరించా లని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్ఓ) డాక్టర్ నరేందర్ రాథోడ్ సూచించారు. తెలంగాణ ఆర్ఎంపీ అండ్ పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మంచిర్యాల జిల్లా కమిటీ సభ్యులు డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నరేందర్ రాథోడ్‌తో పాటు మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లును బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్ ఓ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని మండలాల్లో ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు ప్రజలకు అవసరమైన ప్రథమ చికిత్సను అందిస్తూ, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సేవాభావంతో పని చేయాలని, ఆరోగ్య శాఖ మార్గదర్శకాలను పాటిస్తూ వైద్య సేవలు అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్ఎంపీ అండ్ పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బొద్దుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సీహెచ్. శంకర్ వర్మ, గౌరవ అధ్యక్షుడు పి. రాంచందర్, పట్టణ అధ్యక్షుడు సీహెచ్. ఐలయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి బి. వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం





**ఉట్నూరులో మెగా జాబ్ మే ళాను ప్రారంభించిన ఐటీడీ ఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు**

**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 15, (ప్రజా జ్యోతి)**గిరిజన, గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతకు ప్రైవే ట్ రంగంలో మెరుగైన ఉపా ధి అవకాశాలు కల్పించడ మే ప్రభుత్వ లక్ష్యమని స మగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఉట్నూరు ప్రాజెక్టు అధికారి మందమక రందు అన్నారు.బుధవారం ఉదయం ఉట్నూరులోని కుమ్రంభీం కాంప్లెక్స్ ప్రాంగణంలో ఉన్న యూత్ ట్రైనింగ్ సెంటర్ (వైటీసీ)లో ఏర్పా టు చేసిన మెగా జాబ్ మేళాను ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో కలిసి జాబ్ మేళా ను పరిశీలించి, ఉద్యోగాల కోసం వచ్చిన యువతతో మాట్లాడి వారికి అందుబా టులో ఉన్న అవకాశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధి కారి మాట్లాడుతూ, గిరిజన యువత విద్యతో పాటు నైపు ణ్యాలను పెంపొందించుకుని ప్రైవేట్ రంగంలో లభిస్తు న్న ఉపాధి అవకా శాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐటీడీఏ ఆధ్వ ర్యంలో యువతకు ఉపాధి కల్పించేందుకు నిరంతరం ప్రత్యేక కార్య క్రమాలు నిర్వహిస్తున్నామని, భవిష్య త్తులో మరిన్ని మెగా జాబ్ మేళా లను నిర్వహించి ఎక్కువ మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ మెగా జాబ్ మేళాలో దేశంలోని ప్రముఖ 20 కార్పొరేట్ సంస్థలు పాల్గొన్నాయి. ఆయా సంస్థల హెచ్.ఆర్. ప్రతినిధులు అభ్యర్థులకు ప్రత్యక్ష ఇం టర్వ్యూలు నిర్వహించి వారి విద్యార్హతలు, నైపుణ్యాలు, అనుభవాన్ని పరిశీలిం చి ఉద్యోగాలకు ఎంపిక చేశారు.ఇంటర్వ్యూలలో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు ఐటీ డీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందు, జేడీఎం మేనేజర్ నాగభూ షణం, ఇతర అధికారుల చేతుల మీదుగా అక్కడిక క్కడే నియా మక పత్రాలు (ఆఫర్ లెటర్లు) అందజేశారు. ఉద్యోగాల కు ఎంపికైన యువతను అభినందిస్తూ, వారు తమ విధుల్లో అంకిత భావంతో పనిచేసి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ జనరల్ వసంతరావు,డిడి ప్రేమకల, ఏపీఓ పివిటిజి ఆత్రం భాస్కర్, డిఎంజి సి సందీప్ కుమార్ అడిషన ల్ డి ఎం హెచ్ ఓ మెస్రం మనోహర్, ఈ ఈ తానాజీ, డిప్యూటీ డీఈవో చందన్, పేసా కోఆర్డినేటర్ వసంతరావు, వివిధ శాఖల అధి కారులు, యూత్ ట్రైనింగ్ సెంటర్ సిబ్బంది, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, ఉద్యోగార్థులు, పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువత పాల్గొ న్నారు. జాబ్ మేళా విజయవంతంగా నిర్వహించిన ఐటీడీఏ అధికారులను, పాల్గొన్న సంస్థల ప్రతిని ధులను యువత అభినం దించారు.

# ఉపాధ్యాయుల సంక్షేమము పి ఆర్ టి యు టిఎస్ తోనే సాధ్యం

**జిల్లా అధ్యక్షులు కొమ్ము కృ ష్ణ కుమార్**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 15, (ప్రజా జ్యోతి)** ఉపాధ్యాయుల సంక్షేమం కేవలం పిఆర్ టి యు టిఎస్ తోనే సాధ్యం అని జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణ కుమార్ అన్నారు.పిఆర్ టియుటి ఎస్ బేల మండల శాఖ ఆధ్వర్యంలో ప్రారంభం అయిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కొమ్ము కృష్ణ కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీ నరసింహ స్వామి మాట్లాడుతూ దీర్ఘకాలికం గా అపరిష్కృతంగా ఉన్న డి ఎ పి ఆర్ సిలు సర్వీస్ రూల్స్ ,హెల్త్ కార్డులు త్వరలో సాధించడం జరుగు తుందని అన్నారు. అపరిష్కృత ఉపాధ్యాయ సమస్యల సాధన పిఆర్ టి యు టిఎస్ తోనే సాధ్యమ వుతుందని తెలిపారు. ప్ర స్తుతము రాష్ట్ర ప్రభుత్వాలు కొంత నిర్లక్ష్యం కారణంగా పి ఆర్. సి, డి ఏలు, అనేక రకాల బిల్లులు పెండింగ్‌లో పెట్టడం సగటు ఉద్యోగ ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా పరిణమిచ్చిందని అ న్నారు.ప్రభుత్వము వెంటనే పిఆర్సి నివేదికను తెప్పించు కొని 51 శాతం ఫిట్మెంట్‌తో పి ఆర్ సి ప్రకటించాలని డి మాండ్ చేశారు. ప్రభుత్వము కొన్ని అంశాలను పరిష్కరి స్తామని చెబుతూ ఆలస్యం చేయడము బాగోలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వము, హైకోర్టు 2003 ఉపాధ్యా యులకు పాత పెన్షన్ ఇ వ్వాలని చెప్పినప్పటికీ రా ష్ట్ర ప్రభుత్వము కాలయాపన చేయడం దురదృష్ట కరమ న్నారు. అదేవిధంగా ప్రస్తుత తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వారి మేనిఫెస్టోలో సిపి ఎస్ ని రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ అమలుపరుస్తామని చెప్పి దాదాపు మూడు సంవత్స రాలైనా అమలు చేయక పో వడం వల్ల ఉద్యోగ ఉపా ధ్యాయులలో అసహనం పెరిగిపోతుందని దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వము వెంటనే సిపిఎస్ రద్దు, అన్ని రకాల ఆర్థిక ప్రయోజనాలను కలగజేయాలని,ఏకీకృత సర్వీస్ రూల్స్‌ను అమలు చేసి అన్ని రకాల ప్రమోషన్లను ఇవ్వాలని డిమాం డ్ చేశారు. లేనిపక్షంలో సంఘ పక్షాన పెద్ద మొత్తంలో ఉద్యమ బాట పడతామని ఉపా ధ్యాయులు అందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ దేవరావ్, సిహెచ్ నితిన్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిద్రపు ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యదర్శిగా పావత్ మదన్ లాల్, మండల అసోసియేషన్ అధ్యక్షులు సంతోష్ కుమార్, పాల్గొన్నారు.

## రైతు బాగుంటే ప్రాంతం బాగుంటుంది

ఎన్ని అడ్డంకులు వచ్చినా విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయిస్తా
ప్రజల సౌకర్యం కొరకు కరం జిలోనే మీసేవ సెంటర్
బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్




**భీంపూర్, జూలై 15, (ప్రజా జ్యోతి)** రైతు ఉంటేనే ప్రాంతం బాగుంటుందని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేసి తీరుతామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. భీంపూర్ మండలంలోని కరంజి(టి) గ్రామంలో బుధవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మీసేవ కేంద్రాన్ని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జా దవ్ మాట్లాడుతూ మారు మూల ప్రాంతమైన కరంజి టిలో సైతం విడతల వారిగా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని, మారుమూల ప్రాంతాలకే ఎమ్మెల్యేగా మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతుల కోరిక మేరకు ఎన్ని అడ్డం కులు వచ్చినా విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. తప్పకుండా కరంజి (టి) రోడ్డు పూర్తి చేసే బాధ్యత తనదే నని తెలిపారు. ఈ కార్యక్ర మంలో మండల నాయకు లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రాయి గూడ సర్పంచ్ పెం దూర్ లక్ష్మణ్ రావు




**సిరికొండ, జూలై 15, (ప్రజా జ్యోతి)** సైబర్ నేరాల పట్ల ప్రజలు అ ప్రమత్తంగా ఉండాలని రాయిగూడ సర్పంచ్ పెందూర్ లక్ష్మణ రావు అన్నారు. ఆన్ లైన్ మోసాలను అరిక ట్టడానికి బాధితులను ఆదుకోవడానికి బుదవారం సిరికొండ మండలంలోని రాయిగూడ గ్రామంలో పోలీసులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పెందూర్ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ మీరు ఎ లాంటి సైబర్ మోసానికి డబ్బులు పోగుట్టుకుంటే వెంటనే 1930 నెంబర్ కు కాల్ చేయాలని, మోసం జరిగిన గంటలోగా కాల్ చేయడం ద్వారా పోయిన డబ్బులు రికవరీ చేసే అవకాశాలు ఉంటాయని అన్నారు. ఫిర్యాదును ఆన్ లైన్లో నమోదు చేసుకోవచ్చని, ఇంకా అత్య వసర పరిస్థితులకు పోలీసులు సహాయం కోసం 100 డయల్ చేయాలని, బ్యాంక్ వివరాలు కానీ ఓటిపి కానీ పాస్ వార్డ్ లను చెప్పకూడదని, కెవైసి లింకులను క్లిక్ చేయకూడదని అన్నారు.ఈ కార్యక్రమంలో ఆత్రం శంబు, సిడాం అమృత్ రావు, కొమరం చందు, సిడాం రమేశ్వర్, జైవంత్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## లిగుత్వాల గిరిజన పాఠశాలలో ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ



**నేరడిగొండ జూలై 15 (ప్రజాజ్యోతి):** మండలంలోని గుత్వాల గ్రామ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్, పెన్నులు, పలకలను పంపిణీ చేశారు. ప్రముఖ సామాజిక సేవా సంస్థ 'ఏకల్ అభియాన్' సౌజన్యంతో, సంస్థ జిల్లా ఇంచార్జి సభ్యులు ఉడుగుల అభిలాష్ ఆధ్వర్యంలో ఈ విద్యా సామగ్రి పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లోని, ముఖ్యంగా గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో తమ సంస్థ తరపున ఈ చిన్న సహాయం అందించినట్లు తెలిపారు. విద్యార్థులు ఈ వనరులను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలని ఆకాంక్షించారు. ఈ సేవా కార్యక్రమంలో గ్రామ ఏకల్ టీచర్ కొట్నాక్ శారద, పాఠశాల ఉపాధ్యాయులు అడే అర్జున్, అంగన్‌వాడీ టీచర్ తిరుతమ్మ, స్థానికులు దావుల దినేష్, పెందూర్ భూమన్న, సంతోషిని మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## వికలాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

--ఆ సంఘం జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ




**లక్షెట్టిపేట, జూలై 15(ప్రజా జ్యోతి):** వికలాంగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ ( ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జి ) పెద్దపల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చినటువంటి పెంచిన వికలాంగుల పెన్షన్స్ వెంటనే అందించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో వికలాంగుల జీవో ప్రకారం 5 శాతం రిజర్వేషన్స్ కల్పించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బస్, ట్రైన్ పాస్ లను పునరుద్ధరించాలన్నారు. అంతేకాకుండా ప్రతిపక్ష పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలు ప్రభుత్వాన్ని తమ వికలాంగుల హక్కుల గురించి, వాటి అమలు గురించి ప్రశ్నించకపోవడం బాధగా ఉందన్నారు. కేవలం ఓట్ల సమయంలో మా వికలాంగులకు ప్రాధాన్యతనిచ్చి ఇప్పుడు విస్మరించడం ఎంతవరకు న్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పార్టీలు వికలాంగులను మోసం చేస్తున్నట్లు ఆరోపించారు. నూతన పెన్షన్స్ అందించి మమ్మల్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో సీఎం చంద్రబాబు మాదిరిగా పెంచిన పెన్షన్స్ ను తెలంగాణలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పెరిగిన పెన్షన్స్ వికలాంగులకు అందించాలని విజ్ఞప్తి చేశారు. వికలాంగుల హక్కులు, న్యాయమైన డిమాండ్స్ నెరవేర్చకపోతే రాబోయే రోజుల్లో జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం లక్షెట్టిపేట పట్టణ, మండల నూతన కమిటీలను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల హక్కులు పోరాట సమితి నాయకులు ముల్కల్ల శ్రీనివాస్, దేవి ప్రకాష్, కోడిజుట్టు రాజేశం, రఘుపతి, రాకేష్, రాజలింగు, రవీందర్, లచ్చన్న, రాజు, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

## ఖానాపూర్ లో డబుల్ బెడ్ రూమ్ కాలనీ, బాలికల వసతి గృహాన్ని సందర్శించిన ఆర్డిఓ దేవదాస్



**ఖానాపూర్ జూలై 15 (ప్రజాజ్యోతి )** నిర్మల్ డివిజనల్ అధికారి (ఆర్ డి వో )దేవదాస్, ఎంపీడీవో రాథోడ్ రాధా తో కలిసి ఖానాపూర్ మండలంలోని డబుల్ బెడ్ రూమ్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఆరోగ్య కేంద్ర పనులను పరిశీలించారు పనులు వేగవంతంగా నాణ్యత ప్రమాణాలను పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు అనంతరం స్థానిక బాలికల వసతి గృహం సందర్శించి పరిశుద్ధ కార్యక్రమాన్ని సక్రమంగా చేపట్టాలని బాలికల గదలను క్షుణ్ణంగా పరిశీలించారు పిల్లలకు ఆహారం తయారు చేస్తున్న వంట గదిని పరిశీలించి పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు ఎలాంటి సమస్యలు ఉన్న వెంట వెంటనే వార్డెన్‌కు ప్రధానోపాధ్యాయులకు తెలియజేయాలని విద్యార్థులతో అన్నారు

## కమ్యూనిస్టు విప్లవలోద్యమ సంస్మరణ సభ పోస్టర్లు ఆవిష్కరణ



**ఖానాపూర్ జూలై 15 (ప్రజాజ్యోతి )**కమ్యూనిస్టు విప్లవద్యమ అగ్ర నేతలు భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యత కేంద్రం (మా– లే) వ్యవస్థాపక నాయకులు అమరులు కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు తరిమెల నాగిరెడ్డి కామ్రేడ్ విజయ్ శర్మల సంస్మరణ సభవాల్ పోస్టర్లను బుధవారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ లో ఆవిష్కరించారు జూలై 27 ఉట్నూరు మండల కేంద్రంలోని తరిమెల నాగిరెడ్డి నగర్ పాత ఉట్నూరులో మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు గ్రామీణ పేదల సంఘం నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం మునయ్య పేర్కొన్నారు. ఆ సభ సంబంధించిన గోడ పోస్టర్లను ఖానాపూర్ పట్టణంలోని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత విప్లవపంథ నిర్మాతలు కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు 1917-1984) తరిమెల నాగిరెడ్డి1917-1976) ఈ జులై మాసంలోని ఇద్దరూ అమరులై దశాబ్దాలు దాటినప్పటికీ వారు చూపిన మార్గదర్శకత్వంలో నేటికీ వర్ధించేదిగా ఉందన్నారు వారు చూపిన విప్లవ పంత నేటికీ కొనసాగుతుందన్నారు కామ్రేడ్ దేవులపల్లి వెంకటేశ్వరరావు తరిమెల నాగిరెడ్డి చూపిన మార్గంలో నడుస్తూ కామ్రేడ్ విజయ్ శర్మ గత సంవత్సరం జూలై 12వ తేదీన అనారోగ్యంతో మరణించారు. తన 74 ఏళ్ల జీవితంలో దశాబ్దాలకు పైగా కాలాన్ని కమ్యూనిస్టు విప్లవకారుల పార్టీ కార్యక్రమాలకు విప్లద్యమ నిర్మాణానికి పూర్తిగా ధారా పోసిన త్యాగధనుడు కామ్రేడ్ విజయ్ శర్మ అన్నారు. ఈ అమరుల సమస్మరణ సభకు కార్మికులు కర్షకులు మేధావులు యువకులు అన్ని రంగాల ప్రజలు హాజరై ఈ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ పేదల సంఘం ఖానాపూర్ మండల అధ్యక్షులు దర్శనాల మల్లేష్ గ్రామీణ పేదల సంఘం మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ఎనుముల నరసయ్య. జన్నారం మండల కార్యదర్శి మామిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ‘పోలీసులు మీకోసం’లో భాగంగా మండల స్థాయి వాలీ బాల్ పోటీలు ప్రారంభం

పోటీల్లో పాల్గొననున్న బోథ్, సోనాల మండలాలకు చెందిన 24 జట్లు

రెండు రోజుల పాటు కొనసాగనున్న క్రీడా పోటీలు పోటీలను ప్రారంభించిన బోథ్ సీఐ డి. గురుస్వామి



**బోథ్, జూలై 15, (ప్రజా జ్యోతి)** జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ‘పోలీసులు మీకో సం’ కార్యక్రమంలో భాగంగా యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించి, పోలీసు- ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ ఆదేశాల మేరకు బుధవారం బోథ్ మండల కేంద్రంలోని ఫ్రెండ్స్ క్లబ్ మైదానంలో మండల స్థాయి వాలీబాల్ పోటీలను బోథ్ సీఐ డి గురుస్వామి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బోథ్ సీఐ డి. గురుస్వామి మాట్లాడుతూ, యువత శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, జట్టు భావన పెంపొందించుకోవడానికి క్రీడలు ఎంత గానో దోహదపడతాయని అన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలు, విద్య, ఉపాధి సాధనపై దృష్టి సారించాలని సూచించారు. బోథ్, సోనాల మండలాలకు చెందిన 24 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో విజేతలకు ట్రో ఫీలతో పాటు నగదు బహుమతులు అందజేయనునట్లు పేర్కొన్నా రు. ప్రథమ విజేతకు రూ.5,000, ద్వితీ య విజేతకు రూ.3,000 నగదు బహుమతితో పాటు ట్రోఫీలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 18 న నిర్వహించనున్న గుట్ట పక్క తాండ గ్రామంలో జరగనున్న పోలీసు మీకోసం కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ ముఖ్యఅతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమం లో బోథ్ ఎస్ఐ వి. పురుషోత్తం, ఫ్రెండ్స్ క్లబ్ చైర్మన్ వైద్య సురేష్, వైస్ ప్రెసిడెంట్ ఎల్క రమేష్, గ్రామ సర్పంచ్ అన్నపూర్ణ మహేందర్, గ్రామ పెద్దలు, యువకులు, క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు

# కేటీఆర్ సమక్షంలో కేంద్ర మంత్రి కుమారస్వామితో చర్చలు సఫలం

ఆదిలాబాద్ సిసిఐ పునః ప్రారంభంపై చిగురిస్తున్న ఆశలు

అధునాతన సాంకేతికతతో పరిశ్రమను పునరు ద్ధరిస్తామని కేంద్ర మంత్రి హామీ







**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 15, (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లాలో మూత పడిన సిసిఐ సిమెంట్ పరిశ్ర మ పునఃప్రారంభందిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. సీసీఐ సాధన సమితి ఆధ్వర్యంలో మాజీ మంత్రి జోగు రామన్న నాయకత్వంలో, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స మక్షంలో కేంద్ర భారీ పరిశ్ర మల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని బుధవారం ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రిని శాలువాతో సత్కరించి పూల బొకే అందించారు. అనంతరం ఆదిలాబాద్ సిసిఐ పరిశ్రమ పునః ప్రారంభంపై విస్తృతంగా చర్చించారు. జిల్లాలోయు వతకు ఉపాధి అవకాశాలు కల్పించాలంటే సిసిఐ పరిశ్రమను తిరిగి ప్రారంభించా ల్సిన అవసరం ఉందని కేటీఆర్ కోరారు. చర్చల అనంతరం కేంద్ర మంత్రి కుమార స్వామి స్పందిస్తూ, రాష్ట్ర ప్ర భుత్వం పూర్తి సహకారం అందిస్తే ఆదిలాబాద్ సిసిఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలిపారు. అధునా తన సాంకేతిక పరిజ్ఞానంతో పరిశ్రమను పునఃప్రారంభిం చేందుకు చర్యలు తీసుకుం టామని, ఎట్టి పరిస్థితుల్లో నూ పరిశ్రమను శాశ్వతంగా మూతపడనివ్వబోమని హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన వెసులుబాట్లు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తే సిసిఐ పునరుద్ధరణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీసీఐ సాధన సమితి పోరాటం ఫలి స్తుందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరస్పర ఆరోపణలకు తావులేకుండా సిసిఐ పునః ప్రారంభానికి సంయుక్తంగా ముందడుగు వేయాలని కోరారు. అయితే సిసిఐ విషయంలో నిర్లక్ష్యం కొనసాగితే బీఆర్ఎస్ అధి నేత కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల పై ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని కేటీ ఆర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జోగు రామన్న, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, జాన్సన్ నాయక్, సీసీఐ సాధన సమితి కన్వీనర్ దర్శనాల మల్లేష్, కో-కన్వీనర్ విజ్జగిరి నారాయణ, కో-కన్వీనర్లు అంచెట్టి అరవింద్, అరుణ్ కుమార్, వెంకట నారాయణ, జగన్ సింగ్, లోకారి పోశెట్టి, చిలుక దేవిదాస్, బొల్లు ఈశ్వర్ దాస్, సంగెం బొర్రన్న, ఉజిగిరి విట్టల్, కారింగుల ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ ని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



**సోనాల, జులై 15( ప్రజాజ్యోతి):** సోనాల మండల కేంద్రాని కి విచ్చేసిన జిల్లా కలెక్టర్ రాజర్షిషా గారిని బోథ్ నియోజకవర్గ యువ జన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గుడాల అనీష్ మరియు మండల కన్వీనర్ గాజుల పోతన్న  మర్యాదపూర్వకంగా కలిసి వారిని సన్మానించి,వారి ముందు కొన్ని వినతులు ఉంచడం జరిగింది. ముఖ్యంగా మా మండలంలో ఆదివాసీ గిరిజన గ్రామాలు ఎక్కువగా ఉండడం మరియు వారికి వైద్య సదుపాయం అత్యవసర పరిస్థితుల్లో దొరకడంలేదని గర్భిణి మహిళలు మరియు వృద్ధులకు కూడా చాలా ఇబ్బంది ఉందని,మా మండల వైద్య అత్యవసర పరిస్థితి దృష్ట్యా 108 అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని కోరడం జరిగింది.అలాగే పిహెచ్సిలో పర్మనెంట్ అటెండర్ లేకపోవడం వలన కూడా ఆస్పత్రిలో చాలా ఇబ్బంది అవుతుందని దీనిపైన కూడా దృష్టి సారించాలని విన్నవించడం జరిగింది.మరియు ప్రభుత్వ కార్యాలయాల్లో టాయిలెట్స్ నిర్మించాలని అలాగే,మా మండలం ఉద్యోగాలకు అదర్శ గ్రామం మరియు సరస్వతి పుత్రులకు నిలయం కానీ విద్యార్థిని విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మిగిలిందని, మా మండలానికి టిపిఎస్ స్కూల్ మంజూరు అయ్యేలా మీరు ప్రత్యేక చొరవ చూపాలని కోరడం జరిగింది. విటన్నిటికి కూడా కలెక్టర్ గారు సానుకూలంగా స్పందించి తొందరలో వీటన్నిటికీ పరిష్కారం చూపేలా కృషి చేస్తానన్నారు.

## దివ్యాంగులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు జిల్లా అధ్యక్షులు ఇసక్ అలీ



**ఖానాపూర్ జూలై 15( ప్రజా జ్యోతి )** నిర్మల్ పట్టణ అయిన్ కంటి ఆసుపత్రిలో  దివ్యాంగులకు బుధవారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షులు ఇసక్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు  స్పందన దివ్యాంగుల సంక్షేమ సంఘం  ఆధ్వర్యంలో అర్హులైన దివ్యాంగులు కంటి పరీక్షలు చేసుకోవాలని సూచించారు. గురువారం నేడు కూడా ఉచిత కంటి వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో గల దివ్యాంగుల సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఇందులో డాక్టర్లు జుబెర్, కాశిఫ్, సిబ్బంది మసి ఉద్దీన్, చందు, నర్సయ్య లతోపాటు దివ్యాంగులు శివకుమార్, హనుమంతు, భగవాన్, రియాజ్, వసీమ్, వెంకటేష్ లు పాల్గొన్నారు నిర్మల్ జిల్లాలోని నిర్మల్ ఖానాపూర్ ముధోల్ నియోజకవర్గంలోని దివ్యాంగులంతా కంటి పరీక్షలు చేసుకోవాలని ఈ సందర్భంగా కోరారు

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

**స్మశాన వాటికలో మొక్కలు నాటిన ఎంపీడీవో నరేష్**



**ఇచ్చోడ, జూలై 15, (ప్రజా జ్యోతి)** పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని ఇచ్చోడ ఎంపిడిఓ నరేష్ పిలుపు నిచ్చారు.ఇచ్చోడ మండల కేంద్రంలోని దళిత స్మశాన వాటికలో బుదవారం ఎంపిడిఓ నరేష్ స్థానిక అధికారులతో కలిసి మొక్కలు నాటారు. హరిత హారంలో భాగంగా ఈ మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేష్ వార్డ్ సభ్యులు కొల్లూరి చంద్రశేఖర్, మాజీ ఉపసర్పంచ్ ఏనుగు కృష్ణా రెడ్డి, కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, దళిత సంఘం నాయకులు కొల్లూరి సంతోష్, కొత్తూరు లక్ష్మణ్, అన్నెల లక్ష్మణ్, జిల్ల నరసయ్య, దుబ్బాక చందు, పలువురు యువకులు పాల్గొన్నారు.

# మంద కృష్ణ మాదిగను కలిసిన ఇచ్చోడ ఎమ్మార్పీఎస్ నాయకులు





**ఇచ్చోడ, జూలై 15, (ప్రజా జ్యోతి)** ఉద్యమాల పితామహుడు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ను బుదవారం ఆయన ని వాసంలో ఇచ్చోడ ఎమ్మార్పీ ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణం లోని మాదిగలు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లపై పక్షపాత ధోరణి విషయంలో మందకృష్ణ మాదిగకి వివరించారు. గతంలో దళితులకు ఇచ్చిన ఇంటి స్థలాల విషయంలో కూడా చర్చించారు. ఇచ్చోడ పట్టణంలో ఎమ్మార్పీఎస్ కార్యాలయం, అంబేద్కర్ భవనం విషయంలో చర్చించారు. ఎంపీ ఎమ్మెల్యేలతో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌తో చర్చించి సమస్యలు పరిష్కరించే దిశగా ప్రయత్నిస్తానని మంద కృష్ణ మాదిగ హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు దుబ్బాక సుభాష్ మాదిగ, సిరిసిల్ల భూమయ్య మాదిగ, కాశిపాక విష్ణు మాదిగ, మచ్చ గంగయ్య మాదిగ, కల్లేపల్లి రాజు మాదిగ, మండల అధ్యక్షులు చిట్టి రవి మాదిగ, కొల్లూరు గంగ య్య మాదిగ, జుట్టు మల్లేష్ మాదిగ, ఆరెపల్లి రవి మాదిగ, బేడ బుడగ జంగం స భ్యులు కడమంచి లక్ష్మణ్, ముదుగు శీను, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్సార్ కాలనీ హత్య ఘటనపై స్పందించినజిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల

**త్వరలోనే నిదతులను పట్టుకుంటాం**




**ఖానాపూర్ జూలై 15 (ప్రజా జ్యోతి)**నిర్మల్ పట్టణంలోని వైఎస్సార్ కాలనీలో జరిగిన హత్య ఘటన ప్రాథమిక విచారణలో తన వ్యక్తిగత కారణాల వల్ల జరిగినట్లు గుర్తించామని జిల్లా ఎస్పీ డా.జి. జానకి షర్మిల, తెలిపారు. పరారీలో ఉన్న నింది తులను సైతం గుర్తించడం జరిగిందని అన్నారు పట్టుకుంటామన్నారు అయితే ఈ కేసు దర్యాప్తును పోలీసులు అత్యంత వేగంగా, అన్ని కోణాల్లో సమగ్రంగా కొనసాగిస్తున్నారని,త్వరలోనే అధికారికంగా కేసు పూర్వపారాలని వెల్లడించి నిందితులను వెలికి తీస్తామని జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల వెల్లడించారు

# నూతనంగా ఎన్నికైన కాంగ్రెస్ మండల అధ్యక్షునికి సన్మానం



**లక్ష్మణ చాంద, జూలై 15 (ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ మండల నూతన అధ్యక్షునిగా ఇటీవల పదవీ బాధ్యతలు చేపట్టిన కొండ్ర నరేష్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను బుధవారం రోజున వారి నివాసంలో శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు ఈటల శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, ప్రతాపరెడ్డి, గురాల లింగారెడ్డి, సమ్మెట రవి, సయ్యద్ సిరాజుద్దీన్, కల్లెడ భూమన్న తదితరులు పాల్గొన్నారు.

# సిసిఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణకై కేటీఆర్ తోఢిల్లీ కలిసి వెళ్లిన ఖానాపూర్ అసెంబ్లీ ఇంచార్జ్ జాన్సన్ నాయక్



**ఖానాపూర్ జూలై 15( ప్రజా జ్యోతి )** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మూసి వేయబడ్డ సీసీఐ ఫ్యాక్టరీని పునరుద్ధరించేందుకు బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తో ఖానాపూర్ అసెంబ్లీ ఇంచార్జ్ భూక్య జాన్సన్ నాయక్ ఢిల్లీ బుధవారం తరలి వెళ్లారు మూతపడ్డ సిసిఐ సిమెంట్ ఫ్యాక్టరీ తో అనేకమంది కార్మికులు రోడ్డున పడ్డ విషయాన్ని అదిలాబాద్ నియోజక వర్గానికి చెందిన బి ఆర్ఎస్ పార్టీ నాయకులు మాజీ మంత్రి జోగురామన్న ఆధ్వర్యంలో కేంద్ర మంత్రిని కలిసి ఫ్యాక్టరీ తెరిపించాలని సంబంధిత మంత్రికి వినతి పత్రం సమర్పించారు

# కేంద్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల అభివృద్ధి

**ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి**



**లక్ష్మణ చాంద, జూలై 15 (ప్రజా జ్యోతి)** మండల కేంద్రంలో బుధవారం రోజున బీజే ఎల్పీ నేత నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఎంజి ఎన్ఆర్ ఈజిఎస్ 30 లక్షల రూపాయల నిధులతో ఫుడ్ గ్రైన్ స్టోరేజ్ అగ్రికల్చర్ గోదాంను ప్రారంభించారు అలాగే రాచాపూర్ లో 10 లక్షల రూపాయల నిధులతో ఎస్ హెచ్ జి వివో భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా గ్రామీణ మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యత నిస్తుందని అన్నారు. అలాగే రైతుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల కన్వీనర్ గాండ్ల చిన్నయ్య, గ్రామ సర్పంచ్ ఓస కవిత రాజు, మాజీ ఎంపీపీ అడ్వాల రమేష్, మాజీ సర్పంచ్ సుర కంటి ముత్యం రెడ్డి, ఉప సర్పంచ్ లక్కల వర్మా రవి, బిజెపి నాయకులు గుడ్ల రంజిత్, పోశెట్టి, ఎమ్మార్వో సరిత, ఎంపీడీవో రమాకాంత్, బిజెపి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# వర్షాల కోసం గ్రామ దేవతలకు ‘ట్రాక్టర్ యూనియన్’ సభ్యుల ప్రత్యేక పూజలు



**నేరడిగొండ, జూలై 15 (ప్రజా జ్యోతి):** మండలంలోని కుమారి గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుకుంటూ స్థానిక ట్రాక్టర్ యూనియన్ సభ్యులు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల కురిసిన తొలకరి వర్షాలకు రైతులు పొలాల్లో విత్తనాలు విత్తగా, మొలకలు పైకి వచ్చాయి. అయితే, ప్రస్తుతం ఎండ తీవ్రత విపరీతంగా పెరగడంతో ఆ మొలకలన్నీ ఎండిపోయే పరిస్థితి నెలకొంది. పంటలు దెబ్బతినే ప్రమాదం పొంచి ఉండటంతో ఆందోళన చెందిన ట్రాక్టర్ యూనియన్ సభ్యులు (25 మంది) శనివారం గ్రామంలోని సకల దేవతలైన పోచమ్మ, మైసమ్మ, సారలమ్మ, అమ్మవార్లకు ఘనంగా పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వానలు సమృద్ధిగా కురిసి, పంటలు పచ్చగా పండాలని, రైతులు ఎలాంటి నష్టాల బారిన పడకుండా కాపాడాలని అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో వేడుకున్నారు. ఈ పూజా కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఆడెపు రవి, కుంట కిరణ్ కుమార్ రెడ్డి, మండల్ నవీన్ యాదవ్, ఏ. రాజేందర్, వి. వివేక్, రవి, పి. అశోక్, శేఖర్,లింగన్నలతో పాటు ట్రాక్టర్ యూనియన్ సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సిర్పూర్ (టి) రేంజ్ పరిధిలోని హుడ్కుల్లి శివారు అడవి ప్రాంతంలో మేతకు వెళ్లిన గేదెల మందపై పులి పంజా

పులి దాడిలో చందన్కేడే ప్రవీణ్ కు చెందిన ఒక గేదె మృతి మరొక గేదెకు తీవ్ర గాయాలు

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్బిసిర్పూర్(టి):




**జూలై15,సిర్పూర్(టి) నియోజకవర్గ కరస్పాండెంట్ ప్రజాజ్యోతి:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి) లో గేదెల మందపై పులి పంజా.తీవ్ర గాయాలతో ఇంటికి చేరిన ఒక గేదె, పులి పంజాతో ఘటన స్థలంలో మృతి చెందిన మరో గేదే సమాచారం తెలుసుకున్న ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా పులి దాడిలో ఘటన స్థలంలోనే ఒక మృతి చెందగా మరో గేదే తీవ్రగాలతో ఇంటికి చేరుకుందని నిర్ధారించి ధ్రువీకరించారు. అనంతరం సిర్పూర్ (టి) ఫారెస్ట్ రేంజ్ అధికారి శ్రీనివాస్ సిబ్బందితో కలిసి మాట్లాడుతూ....సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ఫారెస్ట్ రేంజ్ పరిధిలోహుడ్కుల్లి గ్రామ శివారులోని అడవి ప్రాంతంలో మేతకు వెళ్లిన గేదెల మందపై పులి దాడి చేసిందని అన్నారు. హుడ్కుల్లి గ్రామానికి చెందిన చందన్కేడే ప్రవీణ్ కు చెందిన గేదె ఘటన స్థలంలోనే మృతి చెందగా,మరో గేదే తీవ్ర గాయాలతో ఇంటికి చేరుకుందని ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ తెలిపారు. గ్రామస్థులు సిర్పూర్ (టి) రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతానికి వెళ్ళవద్దని, అటవీ సమీపంలో వ్యవ సాయం చేసేవారు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అడవి జంతువుల దాడిలో పశువులు మృతి చెందినట్లయితే,అటవీ శాఖ తరపున నష్ట పరిహారం అందజేస్తా మని,అన్నారు. వన్యప్రాణులకు హాని తలపెట్టవద్దని ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ తెలియజేశారు.

## ప్లాస్టిక్ గోదాం లో భారీ అగ్ని ప్రమాదం

**మీర్ పేట్** హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధి నందనవనంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మెట్రో బార్ సమీపంలోని ఓ ప్లాస్టిక్ గోదాంలో ఒక్కసారిగా మంటలు చలరేగి వేగంగా వ్యాపించి పక్కనే ఉన్న మరో గోదాంను, సమీప భవనంలోని ఇళ్లను కూడా ఆవరించాయి. స్థానికుల సమాచారం అందుకున్న వెంటనే మూడు అగ్నిమాపక వాహనాలు సంఘటనా స్థలానికి చేరుకుని సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

# విద్యుత్ బకాయిలు సాధారణ నిధుల నుంచి చెల్లించేందుకు కృషి చేయాలి

### కలెక్టర్‌కు సర్పంచుల సంఘం వినతి



**ఆసిఫాబాద్ జులై 15 ప్రజా జ్యోతి** జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలను 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కాకుండా సాధారణ నిధుల నుంచి చెల్లించేందుకు కృషి చేయాలని సర్పంచుల సంఘం కోరింది.బుధవారం సర్పంచుల సంఘం జిల్లా సభ్యులు కలెక్టర్‌ను ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు.కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జనవరి 2026 నుంచి జూలై వరకు విద్యుత్ బకాయిలు, సీసీ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయని వారు తెలిపారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ బకాయిలను 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి కాకుండా గ్రామ పంచాయతీల సాధారణ నిధుల నుంచి చెల్లించేలా చూడాలని కోరారు.ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించి సర్పంచుల పట్ల దయతలచాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు డోంగ్రే సంతోష్, ప్రధాన కార్యదర్శి జబరి రవీందర్, సిర్పూర్-టి మండల అధ్యక్షులు ఛత్రు నాయక్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు టెకం గంగారం, వంకిడి మండల అధ్యక్షులు సోను, కోరంగ జూగాది రావు, నీల ఈశ్వరి తోపాటు 335 గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు

## ప్రభుత్వ ఆసుపత్రి ఇంచార్జ్ పర్యవేక్షకులుగా డా. ఎం. అశోక్ కుమార్ బాధ్యతల స్వీకరణ



**మంచిర్యాల, 15, జులై (ప్రజా జ్యోతి):** జిల్లాలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న డా. ఎం. అశోక్ కుమార్ బుధవారం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి ఇంచార్జ్ పర్యవేక్షకులుగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన, సకాలంలో వైద్య సేవలు అందించేందుకు వైద్యులు, సిబ్బందితో సమన్వయంగా పనిచేస్తానని డా. ఎం. అశోక్ కుమార్ తెలిపారు. ప్రభుత్వ వైద్య సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చడం, రోగులకు మెరుగైన చికిత్స అందించడం, ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను సమర్థవంతంగా వినియోగించే దిశగా ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని డా. ఎం. అశోక్ కుమార్ అన్నారు.

# 12వ వార్డులో ఓటరు సేవల హెల్ప్ సెంటర్ ఏర్పాటు



**మంచిర్యాల, 15, జూలై ( ప్రజా జ్యోతి):** మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు 12వ వార్డు కౌన్సిలర్ నజ్మా అమీర్ ఆధ్వర్యంలో మేరా భవన్‌లో పోలింగ్ బూత్ నంబర్లు 180, 181, 182, 183, 184లకు సంబంధించిన ఓటరు సేవల హెల్ప్ సెంటర్‌ను బుధవారం ఏర్పాటు చేశారు.ఈ హెల్ప్ సెంటర్ ద్వారా ఓటరు జాబితాలో పేరు నమోదు, సవరణలు, మార్పులు, ఇతర ఎన్నికల సేవలకు సంబంధించిన సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచారు. బూత్ నంబర్ 180కు గొర్రె లలిత, 181కు నాయిని రాజేశ్వరి, 182కు భూతం విజయ, 183కు జెర్రీల లక్ష్మి, 184కు ఆకుల రాజేశ్వరి బీఎల్ఓలుగా సేవలు అందించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు లింగంపల్లి మహేష్, గడ్డం ఎల్లగౌడ్, సయ్యద్ ఇమాద్, ఎం.డి. జావిద్, అంకుష్, సుల్తాన్ అహ్మద్, మద్దెల సురేష్ కుమార్, బీఎల్ఏ-182 సహీర్ అహ్మద్, ఎం.డి. ఖలీల్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు, సంబంధిత బీఎల్ఓలు పాల్గొని ప్రజలకు ఓటరు జాబితా సంబంధిత సేవలు అందించారు.అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్ పెద్దంటి పద్మ, కో-ఆప్షన్ సభ్యులు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ 12వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి, బీఎల్ఏ-183 ఎస్.డి. ఇమ్తియాజ్ కృతజ్ఞతలు తెలిపారు.